# ఆ నోటా-ఈ నోటా...!

## -మేడేపల్లి రంగవల్లి

ఆ రోజు వినాయకచవితి. సత్యన్నారాయణ చేతిలో సంచీతో గేటు తీసుకుని బైటికొచ్చి మళ్లీ గేటువేసి , వీధి చివరకు వస్తూ చూసాడు ఆ దృశ్యాన్ని. వారి ఇంటికి ఎదురు వీధిలో వుండే ఎక్సైజ్ ఆఫీసులో పని చేసే జనార్దనరావు తన పెద్ద కూతుర్ని బరబరా ఈడ్చుకుంటూ అతని ఇంటికి తీసుకుని వెళ్తున్నాడు.

ఆ అమ్మాయి భర్త ఏదో కాలేజీలో లెక్చరర్. వీరి వెనుక వీధిలోనే అద్దెకుంటున్నారు. ఆ అమ్మాయికి ఒక కూతురు, ఒక కొడుకూను. నిన్నటిదాకా బాగానే వున్నారుకదా అందరూనూ. ఎందుకబ్బా అలా ఈడ్చుకెళ్తున్నాడు?' అనుకుంటూ అన్యమనస్కంగానే బజారుచేసి గబగబా ఆడుగులేస్తూ తమ ఇంటి గేటు వద్దకొచ్చి జనార్దనరావు ఇంటివైపు చూసాడు.

ఏ హడావుడీ లేదు. ఏదో పత్రికోసం అన్నట్లు ఆ ఇంటి దగ్గరా, ఈ ఇంటి దగ్గరా మొక్కల ఆకులు తెంపుతూ వెళ్తున్నట్లు వెళ్తూ జనార్దనరావు ఇంటి ముందు తేరిపార చూసాడు.

ఏం మాటలూ వినబడలేదు. పైగా తలుపులు వేసి వున్నాయి కూడా. ఈలోగా సత్యన్నారాయణ భార్య వసంత-

"ఏవండీ! ఇక చాల్లెండి. వర్జ్యం ముంచుకొస్తోంది. పూజ మొదలుపెట్టాలి రండి'' అని పిలువగానే ఇంట్లోకి వెళ్లి పూజ ముగించాక భార్య బొబ్బట్లు చేస్తుంటే ప్రక్కనే కుర్చీ వేసుకుని కూర్చుని-

"ఏమే ఏమైందో తెలీదుగానీ ఇందాక ఆ ఎక్సైజతను లేడూ వాళ్ల పెద్దమ్మాయిని బరబరా తన ఇంటికి ఈడ్చుకెళ్తున్నాడే. ఆ అమ్మాయికీ, వాళ్లాయనకీ ఏవైనా గొడవలా?'' ఉండబట్టలేక వెళ్లగక్కాడు.

"నిజమా! ఏమో అయ్యుండవచ్చు. ఈమధ్య ఆ పిల్లే పిల్లల్ని స్కూలుకు దిగబెడ్తోంది. ఇన్నాళ్ళూ వాళ్లాయనే బండిమీద దింపేవాడు కదా. ఆ అమ్మాయి కూడా మాటిమాటికీ పుట్టింటికి వస్తోంది. అందుకే అంటారు పుట్టిల్లూ, అత్తిల్లూ పక్కపక్కనే ఉండకూడదని'' అని ఊరుకుందేగానీ వసంత బుర్రలో కుతూహలం, అనుమానం దొలిచేస్తున్నాయి.

బొబ్బట్లు అయీ అయిపోగానే పక్కింటి దేవితో "ఇదిగో దేవీ! ఈ రోజు ఆ ఎక్సైజతని పెద్ద కూతురింట్లో ఏదో గొడవలయ్యాయట. వాళ్ల నాన్న శాశ్వతంగా తీసుకొచ్చేశాట్ట. ఏమై వుంటుందంటావు?'' ఆరాగా అడిగింది.

ఆ దేవి "ఆ...అలాగా. నాకు తెలీదక్కా. నిన్నటిదాకా బాగానే వున్నారుగా. అయినా ఈ డబ్బున్నవాళ్ళేదీ పొక్కనీరులే అక్కా'' అంటూ తను చేసిన కజ్జికాయలిచ్చి బదులుగా నాలుగు బొబ్బట్లు పట్టుకెళ్లింది.

విన్నదిగానీ దేవికీ మనసుండబట్టలేదు. వారికి అటు పక్క వుండే రమాదేవితో "అక్కా! ఆ ఎక్సైజ్ అతను లేడూ వాళ్ల కూతురికీ అల్లుడికీ ఏవో గొడవలట. విడాకులుదాకా వెళ్లిందట విషయం. ఈ డబ్బున్నవాళ్ళు విడాకులు తీసుకుంటే ఏం ఇద్దరు పిల్లలున్నా సరే ఇట్టే మరో పెళ్లి చేసేస్తారు'' అంది.

రమాదేవి ఆశ్చర్యపోయి "మొన్నటికి మొన్నేకదా సినిమాకి ఇంటిల్లిపాదీ వచ్చారు. ఇంతట్లో ఏమైందీ? అయినా పైకి బడాయి, లోపల పుట్టెడు సమస్యలు. ఎందుకు చెప్పు ఆ బడాయి? అయినా విడాకులయిపోయినట్లేనా? ఇంత తొందరగానా? ఏమోలే అంతా డబ్బు మహిమ. ఈ రోజుల్లో అన్నీ ఇన్‌స్టెంటే కదా'' మూతి విరిచింది రమాదేవి.

ఏ ఇంట్లో అయినా ఈ చర్చే! అందరూ గృహిణీమణులు. ఏదైనా టాపిక్ దొరికితే చాలు వారాల కొద్దీ చర్చించుకుంటారు. మరో టాపిక్ దొరికేదాకా అదే వరస.

ఏ ఇంటికెవరొచ్చినా, ఏ ఇంట్లో ఏ విషయమైనా దాన్ని వక్రంగా చిత్రీకరించి ఎంత వీలైతే అంత జోడించి సరదా చేసుకుంటారు. ఇలా వారం పది రోజులు దొర్లాయి ఈ టాపిక్‌తో.

★★★

ఆ రోజు ఆదివారం. సత్యనారాయణ కూరగాయలు తేవడం కోసం సంచి పుచ్చుకుని బయలుదేరాడు వీధిలోకి.

నడిచి వెళ్తున్న సత్యనారాయణ పక్కగా బైకు నాపి "ఏవండీ! కూరగాయలకేనా? రండి నేనూ రైతు బజారుకే. కూచోండి పోదాం'' అన్నాడు నవ్వుతూ జనార్దనరావు.

సత్యనారాయణ కాసేపు తటపటాయించి వెళ్లి వెనుక కూర్చున్నాడు.

"ఏమండీ మీ బాబు హాస్టల్లో బాగానే సెట్టయ్యాడా?'' అనడిగాడు జనార్దనరావు, సత్యనారాయణను.

"ఆ... అయ్యాడు. మొన్ననే చూసొచ్చాను'' అన్నాడు ముక్తసరిగా సత్యనారాయణ.

"పాపం ఎందుకండీ ఆరోక్లాసు నుంచే హాస్టల్‌కీ మీకూ దూరంగా? నా మటుకు నాకు పిల్లల్ని అలా దూరం చేసుకోవడం నచ్చదు'' అన్నాడు యధాలాపంగా జనార్దనరావు.

"ఆ మీకేం చెప్తారు. మాకేం మీలాగా ఆస్తులు లేవు. నాదేదో చిన్న గుమాస్తా ఉద్యోగం. రేప్పొద్దున్న మంచి ఉద్యోగం వచ్చి వాడు వాడి సంసారాన్నయినా పోషించుకోవాలిగదా. ఇంటి వద్ద నుండి చదివిస్తే సరిగా చదవకపోవడమేకాక పాడైపోతున్నాడు ఇక్కడి పిల్లలవలన. అందుకే హాస్టల్లో పడేసాను. వాడికేం దర్జాగా ఉన్నాడు. అక్కడ అన్నీ భేషుగ్గా ఉన్నాయి'' అన్నాడు సత్యన్నారాయణ పౌరుషంగా.

"మీరెంత చెప్పండి పిల్లల్ని దూరం చేసుకోవడం నాకు నచ్చదు. ఇంటి దగ్గరుంచుకుని చదివిస్తే ఎందుకు చదవరు? అంతా మనం చూడడంలో వుంది. మనం చక్కగా అనుకూలంగా చూసుకుంటే ఎందుకు పాడైపోతారు?'' అన్నాడు జనార్దనరావు.

"ఆ మీరలా అనకండి. ఎంత చదువు చెప్పిస్తే మాత్రం ఏం లాభం? ఈ ప్రపంచంలో బ్రతకడం నేర్చుకోవాలికదా. మరి మీ పెద్ద కూతుర్ని మీ ఇంటికి తెచ్చేసుకున్నారు కదా. ఇంటివద్దే వుంచి చదివించి పిల్లలకు మరి మీరేం నేర్పారు?'' అన్నాడు హఠాత్తుగా.

జనార్దనరావు బైకుకి బ్రేక్ వేసి దిగాడు. సత్యనారాయణ కూడా దిగాడు.

"ఏంటి నా పెద్ద కూతుర్ని నా ఇంటికి తెచ్చేసుకున్నానా? అయినా నా పెంపకం గురించి మీకేం తెలుసు?'' అని కోపంగా అడిగాడు.

"అదే మొన్న వినాయకచవితి నాడు బరబరా ఈడ్చుకొస్తుంటే నేను చూడలేదనుకోకండి" అన్నాడు దబాయింపుగా.

జనార్దనరావు జ్ఞాపకం చేసుకున్నాడు. వెంటనే ముఖం ప్రసన్నంగా అయినా వెంటనే పెంపకం గురించి అన్నాడని గుర్తొచ్చి "నా కూతుర్ని నేను నా ఇంటికి తీసుకెళ్తుంటే అలా ఎందుకనుకోవాలి?" నిలదీసాడు.

"ఏదో పక్కన నడిచి వస్తే వేరు. బరబరా ఈడ్చుకెళ్లారు కదా మరి" అంతే నిలదీసాడు సత్యన్నారాయణ ఇప్పుడేం చెప్తావన్నట్లు చూస్తూ.

"అయితే శాశ్వతంగా తెచ్చేసుకున్నట్లేనా?" కొంచెం కోపం జోడించి అన్నాడు జనార్దనరావు.

"బాబూ కాస్త పక్కకు వెళ్లి మాట్లాడుకుంటారా?" ఓ సైకిలిస్ట్ అంటూ వెళ్లిపోవడం చూసి బండి పార్క్‌చేసి వచ్చి-

"ఏంటి చెప్పండి. శాశ్వతంగా తెచ్చేసుకున్నానని మీరనేసుకోవడమేనా?" మళ్ళీ అదే రేంజ్‌లో కోపంగా అన్నాడు జనార్దనరావు.

"మరి కాకపోతే ఎందుకలా లాక్కెళ్తున్నట్లు?" కూపీ లాగినట్లు గర్వంగా చూస్తూ అన్నాడు సత్యన్నారాయణ.

"అదా...అదీ" నీళ్ళు నమిలాడు జనార్దనరావు.

"అదే మరి. గుప్పిట్లో గాలినెంతసేపు దాచగలమండీ" అంటూ విసురుగా ముందుకెళ్లి వంకాయలు కొనబోయి అక్కడి దృశ్యాన్ని చూసి విస్తుపోయాడు.

అక్కడ జనార్దనరావు పెద్దకూతురు, అల్లుడు వంకాయలు కొంటున్నారు. వెంటనే జనార్దనరావు దగ్గరకు వచ్చి ప్రశ్నార్థకంగా చూసాడు. జనార్దనరావు గర్వంగా ముఖం పెట్టాడు.

"ఇంతకీ ఎందుకండీ ఆ రోజు అలా ఈడ్చుకెళ్లారు? చెప్పండి లేకపోతే నా బుర్ర బద్దలైపోతుందేమో" అన్నాడు వేడికోలుగా.

"అబ్బే అదేంలేదండీ. ఆ రోజు పొద్దున్నే మా అబ్బాయి అమెరికా నుంచి ఫోన్ చేసాడు. అక్కతో మాట్లాడతానని అన్నాడు. పిలుచుకురమ్మన్నాడు. వాళ్లింట్లో ఫోనింకా పెట్టించుకోలేదుకదా. పిలవడానికి వెళ్తే అదేమో మా అబ్బాయికెప్పుడో ఏదో పంపమని అడిగిందిట. వాడేమో పంపలేదుట. అందుకని 'నేను మాట్లాడను' అని భీష్మించుకుని కూర్చుంది. వాడికేమో అక్కంటే ప్రాణం. రానని మొరాయిస్తుంటే ఈడ్చుకుని వెళ్లానందుకే" అన్నాడు జనార్దనరావు.

నోరెళ్లబెట్టడం సత్యన్నారాయణ వంతైంది.

"ఏమ్మా వంకాయలు మీ ఆయనకి నచ్చవేమో. అవెందుకు కొంటున్నావు?" అంటూ కూతురివైపు నడుస్తూ సత్యన్నారాయణ వైపు అదోలా





చూసాడు జనార్దనరావు.

సత్యన్నారాయణ గబగబా రెండు కూరలు కొనుక్కుని ఊహించినది జరగనందుకు కించిత్తు బాధపడుతూ ఇంట్లోకి వెళ్ళి వెళ్లగానే...

"వసంతా! అసలు విషయం అది కాదుటే. జనార్దనరావు కూతురూ అల్లుడు బాగానే వున్నారుట. ఏదో ఆ అమ్మాయికి వాళ్ళ తమ్ముడికి గొడవలుండడంతో, ఆ అబ్బాయి ఫోన్ చేస్తే రానందిట. అందుకే వాళ్ళ నాన్న ఈడ్చుకెళ్లారుట" అని కుర్చీలో కూర్చుని చూసేసరికి ఇందాకటి స్థానంలో వసంత లేదు.

అప్పటికే ప్రక్కింటావిడతో విషయం చెప్తూ కనబడింది పెరటి గోడ దగ్గర. ఈ ఆడవాళ్ళు ఎంత ఫాస్టో అనుకున్నాడు సత్యన్నారాయణ.

"రమాదేవక్కా! ఆ ఎక్సైజతని కూతురికీ, కొడుక్కీ ఏవో గొడవలట. మొహమొహాలు చూసుకోరట. ఈ అమ్మాయి పెళ్లికూడా అతను రాలేదుట" ఆమెతో చెప్పడం ఆ కాలనీ అంతా మళ్ళీ కొత్త టాపిక్‌తో కళకళలాడడం వెంట వెంటనే జరిగిపోయాయి.

అసలు ఎందుకిలా ఆలోచిస్తారు మనుష్యులు? మన ఇంట్లో సమస్యలలాంటివే కదా మన పొరుగింట్లో సమస్యలూనూ. మన సమస్యలు కష్టాలు, పొరుగింటి సమస్యలు వినోదాలూనా? మన క్యారెక్టర్ మనకెంత ముఖ్యమో పొరుగువారి క్యారెక్టర్ వారికీ అంతే ముఖ్యం కదా. పాజిటివ్ థింకింగ్ ఎందుకు చేయరు? మనం వారి గురించి చెడుగా అనుకుంటున్నప్పుడు, వాళ్లు కూడా మన గురించీ ఇలాగే చెడుగా అనుకుంటారేమో అని ఒక్క క్షణం ఆలోచిస్తే...!

★